

# పదిలక్షలు!

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

"హలో హిమ్‌చంద్ సాబ్? నమస్తే.

నేను దమన్‌లాల్‌ని. బాంబే నుంచి ఢిల్లీ వచ్చి గంట అవుతోంది. ఎయిర్‌పోర్టు నుంచి సరాసరి హోటల్ ఎమరాల్డ్‌కి వచ్చి మీకు ఫోన్ చేస్తున్నాను. మీ కోసమే వచ్చాను. మీ అమ్మాయి పెళ్ళికి కావలసిన నగలు తెచ్చాను. మీరు ఎన్నిక చేసుకోవచ్చు".

"వెరీ గుడ్ సేఠ్‌జీ. నేను గోల్ఫ్ కోర్స్‌కి బయలుదేరుతున్నాను. ఇవాళ గోల్ఫ్ మ్యాచ్ వుంది".

"మీకెప్పుడు తీరుబడి అవుతే అప్పుడే. మళ్ళీ రేపు ఉదయం ఫ్లైట్‌లో బాంబే వెళ్ళిపోతాను" చెప్పాడు దమన్‌లాల్.

కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత వినిపించింది హిమ్‌చంద్ కె.షా. కంఠం.

"ఓ పని చేయండి. మధ్యాహ్నం మూడింటికి మా ఇంటికి రండి. కారు పంపిస్తాను. కారు నెంబర్ డి.ఐ.డి. 7346".

"అలాగే సర్".

"కొత్తగా గోల్డ్‌లో ఈఫిల్ టవర్ లాకెట్ వచ్చిందటగా? అది వుందా మీ దగ్గర" అడిగాడు హిమ్‌చంద్.

"ఉంది సార్. ఫ్రెంచి గవర్నమెంట్ వాటిని తయారుచేసి ఫ్రెంచి రెవల్యూషన్ బైసెంటినరి సందర్భంగా విడుదల చేసింది. అది ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకున్నది. కస్టమ్స్ డ్యూటీతో కలిపి ఎక్కువవుతుంది."

ఫర్వాలేదు తీసుకురండి. కలెక్షన్‌గా వుంచుకుందామని" చెప్పాడు హిమ్‌చంద్ కె.షా.

ఫోన్ పెట్టేశాక దమన్‌లాల్ అనుకున్నాడు తను తేలిగ్గా నాలుగైదు లక్షల విలువ చేసే బంగారు వస్తువులు అమ్మవచ్చని. హిమ్‌చంద్ కూతురు పెళ్ళి. అతి భాగ్యవంతుడు కాబట్టి ఘనంగా పెడతాడు నగలు.

ఎందుకయినా మంచిదని బ్రీఫ్‌కేస్ తెచ్చి ఈఫిల్ టవర్ లాకెట్ వుందో లేదో చూసుకోవాలనుకున్నాడు. గదిలో ఎక్కడా అతనికి తన బ్రీఫ్‌కేస్ కనపడకపోవడంతో గుండె ఝల్లు మంది.

ఏమైందది? తీవ్రంగా ఆలోచించాడు.

తను టీ తాగుతూ దాన్ని ప్రక్కన కుర్చీమీద వుంచిన గుర్తు. ఆ తర్వాత తనతో టాక్సీలో తెచ్చిన గుర్తు లేదు. అంటే ఎయిర్‌పోర్ట్‌లో మర్చిపోయాడు! పది లక్షల విలువ గల బంగారం గల బ్రీఫ్‌కేస్‌ను ఎంత నిర్లక్ష్యంగా మర్చిపోయాడు!!

దమన్‌లాల్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అది అక్కడ వుండకపోవచ్చు. పది లక్షలు గోవిందా ... ఇంకా ఆలోచించకుండా దమన్‌లాల్ బయటికి పరిగెత్తాడు. బయట వున్న టాక్సీ ఎక్కి ఎయిర్‌పోర్ట్‌కి పోనివ్వమన్నాడు. దమన్‌లాల్‌కి ఎంతో టెన్షన్‌గా వుంది. తనని తానే తిట్టుకోసాగాడు. ఎంత? ఒకటా? రెండా? పదిలక్షలు.

టాక్సీ డ్రైవర్‌ని ఇంకాస్త వేగంగా వెళ్ళమని దారిలో నాలుగైదు సార్లు హెచ్చరించాడు. టాక్సీ ఆగంగానే వంద రూపాయిల నోటు యిచ్చి చిల్లర కోసం ఆగకుండా లోపలికి పరిగెత్తాడు.

ఎంట్రన్స్ టిక్కెట్ కొని గబగబా డిపార్చర్ లాంజ్‌లోంచి ఎరైవల్స్ లాంజ్‌లోకి వెళ్ళాడు. సరాసరి రెస్టరెంట్ లోకి నడిచాడు.

తను ఎక్కడ వుంచాడో సరిగ్గా అక్కడే వుంది ఆ నల్లటి బ్రీఫ్‌కేస్! దమన్‌లాల్ గట్టిగా నిట్టూర్చాడు రిలీఫ్‌తో. కాని రెస్టరెంట్‌లోకి ఎవరు వెళ్ళకుండా స్టెన్‌గన్స్‌తో పోలీసులు కాపలా వున్నారు. బ్రీఫ్‌కేస్ చుట్టూ ఇసుక నింపిన గోనె సంచుల్ని పేరుస్తున్నారు. కొందరు సెక్యూరిటీ మనుష్యులు దూరంగా నిలబడి ఆ బ్రీఫ్‌కేస్ వంక ఆసక్తిగా చూస్తున్నారు రెస్టరెంట్ స్టాఫ్.

దమన్‌లాల్ లోపలికి వెళ్ళబోతుంటే ఆపాడు సెక్యూరిటీ పోలీస్.

"లోపలికి వెళ్ళకూడదు. బాంబ్ వుంది".

"బాంబా?" అదిరిపడ్డాడు.

"అవును టైం బాంబు"

"అక్కడ వున్న బ్రీఫ్‌కేస్‌ని తీసుకుని వచ్చేస్తాను" చెప్పాడు దమన్‌లాల్ బతిమాలుతున్నట్టుగా.

"ఆ బ్రీఫ్‌కేస్‌లోనే వుంది బాంబు".

"అందులో బాంబా? లేదు. నా నగలు వున్నాయి. నేను నగల వ్యాపారస్థుడ్ని" తన విజిటింగ్ కార్డు ఇచ్చి చెప్పాడు దమన్‌లాల్.

"అయితే, నాతో రండి" చెప్పాడు సెక్యూరిటీ పోలీస్. ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ పోలీస్ అధికారి దగ్గరకు తీసుకువెళ్ళారు దమన్‌లాల్‌ని. కొద్ది నిమిషాలలోనే మిస్టరీ విడిపోయి అందరి మొహాలలో చిరునవ్వులు వెలిశాయి.

ఎవరో వదిలివెళ్ళిన ఆ బ్రీఫ్ కేస్‌ని చూసిన రెస్టరెంట్ వెయిటర్స్ దాన్ని ముట్టుకోలేదు. వాళ్ళకి ముందే ఇచ్చిన శిక్షణ ప్రకారం పోలీసులకి తెలియజేశారు అందులో టైంబాంబు వుండచ్చన్న భయంతో.

"ఇండియాలో టెర్రరిస్టులు అధికంగా. అది వాళ్ళ పని అనుకున్నాం. బ్రీఫ్‌కేస్‌ను ఎవరో మర్చిపోయినట్లుగా వదిలివెళ్ళడం, అందులో టైంబాంబు పేలడం చాలసార్లు జరిగింది" చెప్పాడు సెక్యూరిటీ చీఫ్ దమన్‌లాల్ బ్రీఫ్‌కేస్ తీసి, తాళం తెరచి నగలు చూపించి

"అయితే ఆ టెర్రరిస్ట్‌లకి నా ధన్యవాదాలు. వాళ్ళ భయం లేకపోతే ఈ పది లక్షల విలువ గల నగలు నాకు తిరిగి దొరికేవి కావు" చెప్పాడు దమన్‌లాల్ తృప్తిగా.

●

